నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
17 వ
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
సోమవారం,2 సెప్టెంబర్ 2024

నేడు ప్రభుత్వ, ప్రైవేటు, అంగన్‌వాడి పాఠశాలలకు శెలవు

ఏలూరు,మేజర్‌న్యూస్: జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు, అంగన్వాడి సెంటర్లకు సోమ వారం సెప్టెంబర్ 2వ తేదీ సెలవును ప్రకటిం చడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సెలవును పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ రద్దు : జిల్లా కలెక్టర్

ఏలూరు,మేజర్‌న్యూస్: జిల్లాలో భారీ వర్షాలు కారణంగా ఈనెల 2వతేదీ సోమవారం జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా జిల్లా లోని రెవిన్యూ, జిల్లా, మండల స్థాయి అధికారులు పునరావాస కార్యక్ర మాలలో నిమగ్నమై ఉన్నందున జిల్లాలోని కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల స్థాయిలలో ఈనెల 2వతేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ తెలియజేసారు.

నేడు విద్యా సంస్థలకు శెలవు

భీమవరం,మేజర్‌న్యూస్: జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు, అంగన్వాడి సెంటర్లకు సోమవారం సెప్టెంబర్ 2వ తేదీ సెలవును ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.
సెలవును పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు .

జలదిగ్బంధంలో నూజివీడు !

- సహాయక చర్యలపై సిఎం చంద్రబాబు ఆరా
- బాధితులకు అండగా మంత్రి పార్థసారథి,జిల్లా యంత్రాంగం

నూజివీడు,మేజర్‌న్యూస్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారడంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత రెండురోజులుగా ఎడతెరిపిలేని వర్షాలకు నూజివీడు పట్టణం అతలాకుతలమైంది. నూజివీడుకే తలమానికం అయిన పెద్ద చెరువుకు మూడు గండ్లుపడ్డాయి. దీంతో చెరువులో నీళ్ళని బయటికి రావటంతో,లోతట్టు ప్రాంతాలన్నీ నీటమునిగిపోయాయి. రోడ్లన్నీ జలమయం కావడంతో జనం తీవ్ర అవస్థలు పడ్డారు. 24 గంటల వ్యవధిలో ఏకంగా భారీ వర్షంతో వరుణుడు కుంభవృష్టి కురిపించాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షం కురిసింది. రహదారులన్నీ ఏరులయ్యాయి. ఏకధాటి వర్షాలకు నూజివీడు పట్టణం జలదిగ్బంధంలో వుంది. పెద్ద చెరువులో నీళ్లు బయటకు రావడంతో అన్నవరం పోతిరెడ్డిపల్లి గ్రామాలకువెళ్లే దారులు నీటితో నిండి పోవడంతో వాహనాలు నిలిచిపోయాయి.అదేవిధంగా విజయవాడ హనుమాన్ జంక్షన్ వెళ్ళే రహదారులు కూడా నీటితో నిండిపోవడంతో ఆదివారం నాడుబంద్ అయ్యాయి.గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న చిన్న చెరువులు సైతం పొంగిపోర్లటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నూజివీడు బస్టాండ్ నీట మునగడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సు సర్వీసులను ఆర్టీసీ రద్దు చేసింది. లోటట్టు ప్రాంతాలలో ఇల్లు మునిగిపోయిన బాదితులకు నూజివీడు పట్టణంలోని పలు ప్రాంతాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శని ఆదివారాల్లో ముంపు ప్రాంతాలను పరిశీలించారు.సహాయకచర్యలకు సంబంధించి అధికా రులకు ఆదేశాలు జారీ చేశారు. నూజివీడులో నెలకొన్న పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరాతీశారు. మంత్రి పార్థసారధిని అడిగి తెలుసుకున్నారు.బాధితులకు అన్నివిధాలుగా అండగా ఉండాలని, సహాయక చర్యలు ముమ్మరం చేయాలని చంద్రబాబు సూచించారు.

బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

- గండ్లు పడకుండా చెరువులు,కాల్వ గట్ల పటిష్ఠతకు చర్యలు
- లోతట్టు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

: మంత్రి పార్థసారధి

నూజివీడు,మేజర్‌న్యూస్ : భారీ వర్షాలు, వరదల కారణంగా చెరువులు, కాల్వల గట్లకు గండ్లు పడకుండాగట్ల పటిష్టతకు చర్యలు తీసుకుంటా మని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. భారీ వర్షాల కారణంగా నీట మునిగిన నూజివీడు పట్టణంలోని గాంధీనగర్,ఎన్టీఆర్‌కాలనీ,అప్పారావు పేట, నూజివీడు మండలంలోని బత్తులవారిగూడెం,యలమందల తదితర పలు గ్రామాలలో ఆదివారం మంత్రిపార్థసారధి విస్తృతంగా పర్యటించి బాధితులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకుని,లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించేలా దగ్గరుండి చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.వర్షాలు తగ్గే వరకు ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి భోజన, వసతి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. నూజివీడు లోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని మంత్రి పరిశీలించి వారికి కల్పిస్తున్న సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. నూజివీడులోని మోటుపల్లి తాతారావు జూనియర్ కళాశాల వరదనీటిలో మునగడంతో హాస్టల్ విద్యార్థులు 70 మందిని నిన్న ఉదయం సాంఘిక సంక్షేమ హాస్టల్‌కి తరలించారు హాస్టల్ సందర్శించి విద్యార్థుల యోగక్షేమాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు కావలసిన త్రాగునీరు బట్టలు ,నిత్యావసర సరుకులు బియ్యం తక్షణమే అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం హెల్పింగ్ హేండ్స్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు బట్టలు, నగదును మంత్రి సారథి అందజేశారు.

వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు అప్రమత్తంగా ఉండాలి

- పారిశుధ్య పనులు మరింత మెరుగుపరచాలి
- వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్,ఎస్పీ, జెసి

నూజివీడు,మేజర్ న్యూస్: వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఆదివారం నూజివీడు వెలమపేట, పెట్రోల్ బంక్, తిరు వూరు రోడ్డు లారీ యూనియన్ ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి పర్యటించారు. తొలుత స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయబడిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ బాధితులకు ఏర్పాటు చేసిన వసతి, భోజన సౌకర్యాలను పరిశీలన చేశారు. వెలమపేట వరద నీరు వచ్చిన కారణంగా శిధిలావస్థలో వున్న గృహాల్లో ఉంటున్న కుటుంబాలను పునరావాస కేంద్రానికి రావాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్ వెలమపేటలోని ఇళ్లను పరిశీలించి లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను, శిధిలావస్థలోవున్న గృహాల్లో నివశిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు చేర్చాలని సంబంధిత రెవిన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు. శిధిలావస్థలోవున్న గృహంలో నివసిస్తున్న సరోజిని అనే వృద్ధురాలిని వెంటనే పునరావస కేంద్రానికి రావాలని కలెక్టర్ కోరారు. ఒంటరిగా ఉన్న వారిని తప్పనిసరిగా పునరావాస కేంద్రానికి వచ్చేలా నచ్చజెప్పాలని సంబంధిత అధికారులను, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అక్కడ ఉన్న 7వ తరగతి చదువుచున్న టి.వివేక్, సిహెచ్ రమేష్ లను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పలకరిస్తూ అధిక వర్షాలు పడుతున్నందున బయట తిరగవద్దని, ఇంటిలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. వారిని చదువుకుని ఏమిచేస్తారని ప్రశ్నించగా వివేక్ పైలెట్ అవుతానని చెప్పడంతో అయితే మనకొక పైలెట్ వస్తాడని చిరునవ్వుతో కలెక్టర్ అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ భారీవర్షాలు మూలంగా దెబ్బతిన్న ఇళ్ల వివరాలను వెంటనేపంపాలనిసంబంధిత అధికారు లను ఆదేశించారు.వీరివెంటనూజివీడుఆర్డిఓ వై.భవానీశంకరి ,మండల ప్రత్యేక అధికారి,ఉద్యానశాఖ డిడి రామ్మోహన్, మున్సిపల్ కమీషనరు,స్థానిక రెవిన్యూ, పోలీస్ అధికారులు ఉన్నారు.

తమ్మిలేరు పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చింతలపూడి,మేజర్ న్యూస్: జిల్లా చింతలపూడి మండలం నాగిరెడ్డి గూడెం వద్ద గల తమ్మిలేరు రిజర్వాయర్ లోనికి ఆదివారం రాత్రి 9 గంటల సమాచారం ప్రకారం ఇన్ ఫ్లో 9907 క్యూసెక్కులు గాను, ఔట్ ఫ్లో 9352 క్యూసెక్కులు గా ఉన్నట్లు ఎ. ఇ. ఇ. పరమానందం తెలిపారు. రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 355 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం తమ్మిలేరు బేసిన్ 348.50 అడుగులు గాను గొనెల వాగు బేసిన్ 348.08 అడుగులు గాను వుంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3 టి.ఎం. సి.లు కాగా ప్రస్తుత నీటి నిల్వ 1.859 టి.ఎం.సి.లుగా వుందని పరమానందం తెలిపారు. తమ్మిలేరు పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడమైనది.

ట్రిపుల్ ఐటి ఘటనలపై మంత్రి లోకేష్ సీరియస్

- నూజివీడు ఐటి డైరక్టర్ ను తొలగిస్తూ ఆదేశాలు
- ముగ్గురు సభ్యులతో పర్యవేక్షక కమిటీ ఏర్పాటు

నూజివీడు,మేజర్‌న్యూస్:రాజీవ్‌గాంధీసాంకేతికవైజ్ఞానిక విశ్వ విద్యాలయం పరిధిలోని నూజివీడు ట్రిపుల్ ఐటీలో కలుషితాహారం తిని పెద్దఎత్తున విద్యార్థులు అనారోగ్యానికి గురైన ఘటనను రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సీరియస్ గా తీసుకున్నారు. మంత్రి కొలుసు పార్థసారధి స్థానిక శాసనసభ్యులు కూడా కావడంతో నిరంతరంట్రిపుల్ ఐటిలోని పరిస్థితులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కాగా విద్యార్థుల ఆహారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నూజివీడు ట్రిపుల్ ఐటి డైరక్టర్‌ను ఆ బాధ్యతలనుంచి తప్పిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు.అక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు,వారి తల్లిదండ్రుల్లో నమ్మకం పెంపొందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నూజివీడు ట్రిపుల్ ఐటి పర్యవేక్షణ కోసం త్రిసభ్య కమిటీని నియమించారు. ఇందులో కాలేజి ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యశాఖ ఇన్ ఛార్జి చైర్మన్ రామ్మోహన్ రావు, ఏలూరు కలెక్టర్ కె.వెట్రి సెల్వి సభ్యులుగా ఉంటారు.పర్యవేక్షణ కమిటీ ఈఅంశాలపై దృష్టిసారిస్తుంది. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత నిర్వహణ కోసం ప్రామాణిక ఆపరేటింగ్ ప్రోటోకాల్ పాటించడం. పారిశుధ్యం,మెస్ పరిశుభ్రత నిర్వహణ కోసం ప్రామాణిక ఆపరేటింగ్ ప్రోటోకాల్‌అమలుచేయడం. విద్యార్థుల హాస్టల్‌లో మెరుగైన పారిశుధ్యం,నాణ్యతా ప్రమాణాలఅమలుకు చర్యలు తీసుకోవడం. నూజివీడు ట్రిపుల్ ఐటిలో అవసరాలకు అనుగుణంగా చిన్నచిన్న మరమ్మతులు చేయడం. లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి అంతర్గతఫిర్యాదు కమిటీని ఏర్పాటు చేయడం, ఫిర్యాదుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండావేగంగా వాటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడం.

ప్రతి డిపార్ట్‌మెంట్ స్థాయిలో తగిన యంత్రాంగాన్ని ఏర్పాటుచేయడం ద్వారా డ్రగ్ ఫ్రీ,పొగాకు రహిత సంస్థల కోసం కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడానికి సిద్ధం కావాలని మంత్రులు ఆదేశించారు. సమస్యల తక్షణ పరిష్కారానికి నిర్ణీత సమయంతో కూడిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి నారాలోకేష్ పర్యవేక్షక కమిటీకి సూచించారు.ఏవైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న వెంటనే కమిటీ ఆ అంశాన్ని ప్రభుత్వందృష్టికి తీసుకువచ్చి, సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటుందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

ఎమ్మెల్యే,మేయర్ దంపతుల సంక్షంలో టిడిపిలో చేరిన15 మంది వైసీపీ కార్పొరేటర్లు

ఏలూరు,సూర్య బ్యూరో : ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ లో మరోసారి వైసీపీకి షాక్ తగిలింది.ఆదివారం 15 మందివైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్‌కార్పొరేటర్లు,కోఆప్షన్ సభ్యులు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి)ఆధ్వర్యంలో తెలుగుదేశంలో చేరారు. తొలుత కార్పొరేటర్లు నగర మేయర్ షేక్ నూర్జహాన్,ఆమె భర్త కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు వ్యక్తిగత కార్యాలయంలో సమావేశమయ్యారు. ఇటీవల మేయర్ దంపతులు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశంలో చేరిన సంగతి విధితమే. ఈ నేపథ్యంలో ఒకేసారి 15 మంది కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు తమ వ్యక్తిగత కారణాలవల్ల వైయస్సార్సీపి ప్రాథమిక సభ్యత్వాలకు,పదవులకు రాజీనామా చేస్తున్నట్టు నూతనంగా వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డిఎన్ఆర్)కు లేఖల ద్వారా తెలిపారు. ఆదివారం టిడిపి లో చేరిన వారి పేర్లు ఈ విధంగా ఉన్నాయి. గూడూరిఆదిలక్ష్మి,అన్నపనేని భారతి,గునిపూడి శ్రీనివాసరావు, ఉచ్చుల సుజాతసన్నీ,కత్తిరిరామోహన్‌రావు,యర్రంశెట్టి సుమన్,ఈదు పల్లి కళ్యాణి దేవి,మహమ్మద్ ఇలియాస్ పాషా,స్వాతి శ్రీదేవి నున్న,దేవరకొండ శ్రీనివాసరావు,కో-ఆప్షన్ సభ్యులు నీతాజైన్,సబ్బన శ్రీనివాస్,పాము పద్మ,జున్నూరు కనక నరసింహారావు,యర్రంశెట్టి నాగబాబు కాగా తొలుత పవర్ పేటలోని శాసనసభ్యులు బడేటి చంటి కార్యాలయం వద్దకు వెళ్లి ఎమ్మెల్యే,మేయర్ దంపతుల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఏలూరు కార్పొరేషన్‌లో మొత్తం సభ్యుల సంఖ్య 50 కాగా,వైయస్సార్సీపీకి 47మంది,తెలుగుదేశంపార్టీకి ముగ్గురు గతంలో ఎన్నికయ్యారు.అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు ముందే వైసీపీ ముగ్గురు కార్పొరేటర్లు తెలుగుదేశంలోచేరారు.
ఇటీవల మేయర్,3వ డివిజన్ కార్పొరేటర్ టిడిపిలో చేరారు. మిగిలిన 45 మందిలో ఆదివారం 15 మంది చేరారు. మరో రెండు దఫాలుగా మిగిలిన కొంతమంది కార్పొరేటర్లు టిడిపిలోచేరేఅవకాశం కనిపిస్తోంది. ఈ విధంగా ఏలూరు కార్పొరేషన్ చివరకు టిడిపి వశం కానుంది.

నేడు మీకోసం కార్యక్రమం రద్దు

భీమవరం,మేజర్ న్యూస్: జిల్లాలో కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని రేపు సోమవారం సెప్టెంబరు 2వ తేదీన జరగవలసిన మీకోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. డివిజన్, మండల కేంద్రాల్లో కూడా మీకోసం కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించవలసిందిగా జిల్లా కలెక్టర్ కోరారు.

వరి పొలాలను పరిశీలించిన మంత్రి రామానాయుడు

పోడూరు,మేజర్‌న్యూస్ : మండలంలో పెనుమదం గ్రామంలో భారీ వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. అక్కడ రైతులతోను మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో భారీవర్షాలు వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు గంట, గంటకు సమీక్షలుచేస్తూ ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన అన్ని సహాయ చర్యలపై జిల్లా కలెక్టర్లకు, జిల్లా ఎస్పీలకు ఆదేశాలు ఇస్తున్నారని తెలిపారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసుకుని అల్పాహారం, భోజనం,మంచినీటి సరఫరా దరిద్రం మౌలిక సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారని మంత్రి తెలిపారు. గోదావరి ఏటిగట్టు పటిష్టతకు ఇసుక బస్తాలను, సర్వేబాదులను, వేదురు తడికలు, అవసరమైన సామాగ్రిని సిద్ధం చేయాలన్నారు. వరద ముంపు ప్రాంతాలలో నెలలు నిండిన గర్భిణీ స్త్రీలను, దీర్ఘవ్యాధి గ్రస్తులను,బెడ్ రెస్ట్ తీసుకుంటున్న పేషెంట్లను గుర్తించి దగ్గరలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్లోజాయిన్ చేయాలనిఆదేశించామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు పెనుమత్స రామభద్రి రాజు,గొట్టు ముక్కల సూర్య నారాయణ రాజు,టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా చంద్రబాబు 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కటింగ్

టి.నర్సాపురం,మేజర్‌న్యూస్:టీ.నర్సాపురం మండలంలోని రాజ పోతే ఓపల్లి గ్రామంలో నారా చంద్రబాబునాయుడు ముఖ్య మం త్రిగా 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసిన మాజీ జడ్పిటిసి సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పార్టీ తెలుగుదేశం నాయకులు జాస్ సుబ్బారావు గుండు శ్రీను దావులూరు మోహన్ కృష్ణ నక్కలపూడి రామచంద్ర కేసిన వెంకటేశ్వర రావు,గుమ్మంల అనిల్ గుమ్మల బాలరాజు,నక్కలపూడి రామచంద్ర రావు, దేవరపల్లి ప్రశాంత్,గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

టి.నర్సాపురం, మేజర్ న్యూస్: 1995 సెప్టెంబర్ 1 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నేటి ఈ ఆదివారం నాటికి 29 ఏళ్లు పూర్తిచేసుకుని 30 ఏట అడుగుపె డుతున్న నవ్యాంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి పలువురు తెలుగుదేశం నేతలు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల దేవిపేట గ్రామంలో రాష్ట్ర తెలుగు కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈకార్యక్రమంలో కృష్ణ మూర్తి,వడ్డే శ్రీను, పండు, వీరాస్వామి నాయుడు, వీరాజు,శ్రీను , వీరబాబు, కార్యక ర్తలు, నాయకులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో రక్తదానాలు : ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు/ఉంగుటూరు,మేజర్ న్యూస్: డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకుని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదేశాలు మేరకు ఉంగుటూరు నియోజకవర్గ వ్యాప్తంగా జనసేన శ్రేణులు ఆదివారం రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేసారు. గణపవరం, మొయ్యేరు, వల్లూరు, బువ్వనపల్లి, పూళ్ల, భీమడోలు గ్రామాలలో జనసేన శ్రేణులు రక్తదాన శిబిరాలను ఏర్పాటుచేసి నియోజకవర్గ వ్యాప్తంగా 400మంది జనసేన కార్యకర్తలు, మెగా అభిమానులు తమ రక్తాన్ని దానం చేసారు. ఈసంద ర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు ఆయా రక్తదాన శిబిరాలకు వెళ్లి రక్తదాతలను అభినందించారు. పళ్ళు, ఒఆర్ఎస్ ప్యాకెట్లను వారికి అందించారు. భీమడోలు శిబిరంలో టీడీపీపార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, జనసేన ఉంగుటూరు నియోజకవర్గ సమన్వయకర్త వట్టి పవన్ కుమార్ ఎమ్మెల్యే ధర్మరాజుతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ధర్మరాజు కూటమి శ్రేణులు,పవన్ కళ్యాణ్ అభిమానులతో కలిసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో జనసేన భీమడోలు మండల అధ్యక్షులు ప్రత్తి మదన్, టీడీపీ, బీజేపీ అధ్యక్షులు కొండబాబు, ప్రవీణ్ పటేల్, పుల్లయ్యనాయుడు, జనసేన వీరమహిళలు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో రుద్రహోమం

పాలకొల్లు,మేజర్ న్యూస్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా ఉదయం రుద్రహోమం నిర్వహించారు,ఈ హోమంలో 9 మంది దంపతులు పాల్గొన్నారు, అలాగే రాత్రి 6గం.నుండి శ్రీ స్వామి వారికి లక్ష ముత్యాలపూజ, లీలకళ్యాణం జరిగింది,ఈ కల్యాణంలో 13 మంది దంపతులు పాల్గొన్నారు,వీరికి శ్రీస్వామి వారి శేషవస్త్రములు ప్రసాదములు అందజేశారు, ఈ హోమం, కళ్యాణం యాజ్ఞకబ్రహ్మ భమిడిపాటి వెంకన్న సారధ్యంలో జరిగింది,ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు పర్యవేక్షణ చేశారు,

ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించండి

– అధికారులకు సమాచార శాఖ మంత్రి పార్థసారధి ఆదేశం

నూజివీడు,మేజర్న్యూస్ : భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అధికారులను ఆదేశించారు.భారీవర్షాల కారణంగా దెబ్బతిన్న ఎనమందల, బత్తుల వారి గూడెం, సుంకొళ్లు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రతీ కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. ఎనమందల గ్రామంలో పెద్ద చెర్వు పొంగిపొర్లుడంతో దెబ్బతిన్న పంటపొలాలను, గ్రామంలోని ఎస్.సి కాలనీలోని రోడ్లను మంత్రి పరిశీలించి, అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న రోడ్లకు వెంటనేమరమ్మత్తులు చేయించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

బత్తుల వారిగూడెం పెద్ద చెరువు తెగి ముంపుకు గురై పూర్తిగా నేలమట్టం ఐనఇళ్ళు కూలిపోయిన కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రతీ రైతును, ప్రతీ కుటుంబాన్ని అన్నిరకాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

ముంపు ప్రాంతాలలోని ప్రజలను అత్యవసరంగా పునరావాస కేంద్రాలకు తరలించి భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. ముంపు ప్రాంతాల్లోనే గర్భిణీలను దగ్గరలోనే పిహెచ్సిలకు తరలించాలని,పిల్లలు,వృద్ధులు, దివ్యాంగులను సురక్షిత ప్రాంతాలకుతరలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాలు,వరదపరిస్థితిపై రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గంట గంటకు ఫోను ద్వారా అడిగి తెలుసుకుంటున్నారని మంత్రి తెలియజేసారు.

పలు గ్రామాల్లో పవన్ పుట్టినరోజు వేడుకలు

– అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సతీమణి బొమ్మిడి సునీత

నర్సాపురం రూరల్,మేజర్న్యూస్: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం మండలంలోని చిట్టవరం, గొంది, పాత నవరసపురం, కొత్త కొత్తనవసరపురం గ్రామంలో స్థానిక జనసేన పార్టీ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొక్కలు నాటారు, రక్తదానం చేశారు, కేక్ కటింగ్ చేసి అభిమానులకు పంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సతీమణి సునీత నాయకర్ విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు పురస్కరించుకుని ఆది సోమవారాల్లో నియోజకవర్గంలో మొక్కలు నాటుట, రక్తదాన శిబిరాలు,ఉచిత వైద్య శిబిరాలు,వస్త్ర దానం, అన్నదానం, కేక్ కటింగ్స్, స్వీట్స్ పంపిణీ మొదలైన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పైడికొండల కృష్ణ, కర్రా శ్రీను, చల్లా హేమ, కోపల్లి శ్రీనివాస్తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో వ్యవసాయ అధికారులు పర్యటన

నరసాపురం రూరల్,మేజర్న్యూస్ :మండలంలో గత రెండు రోజులగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ముంపునకు గురి అయిన వ్యవసాయ పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి జడ్.వేంకటేశ్వర రావు ఆదివారం పరిశీలించారు.కొప్పరు,మల్లవరం తదితర గ్రామములలో ఆయన పర్యటించి ముంపు నీరునితరలించి విధముగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు సొంత ఇంజన్లు ద్వారా నీటిని తొడుకునేవారికి ప్రభుత్వంచే డీజల్ కూపన్లు ఇచ్చే విధంగా జిల్లా కలెక్టర్ ఆదేశించి ఉన్నారు కాబట్టి రైతులు సంబంధిత మండల తహసీల్దార్ వారిని సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవలసినదిగాతెలిపారు.ముంపునకు గురియన వరి చేలలో నీరు బయటికి తొడిన వెంటనే తెగులు నివారణకు సాఫ్మందును ఎకరానికి 400జిమ్ చప్పున పిచికారి చేసుకోవాలని సూచించారు దీనితో పాటు ఎకరానికి యూరియా 20కేజీలు, పొటాష్ 20కేజీలు, వేసుకోవలసినదిగా సూచించారు. గొంతెరు నుండి కొప్పర్రు వచ్చు మురుగు కాలువ నిర్వహణలో ఉన్న ఇబ్బందులను గుర్తించి సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు తెలియచేశారు.ఈకార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఈ అనిల్ కుమారి,మండల వ్యవసాయ అధికారిఎం.శామ్యూల్ జాన్సన్,గ్రామ వ్యవసాయ సయహకులు స్నేహ,మహాలక్ష్మి, విఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ,జెసి,ఎమ్మెల్యే పర్యటన

– పలు సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన చింతమనేని

పెదపాడు,మేజర్ న్యూస్: వరద ప్రభావిత బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి స్పష్టం చేశారు. పెదపాడు మండలం అప్పనవీడులోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం స్థానిక శాసన సభ్యులు చింతమనేని ప్రభాకర్ తో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి పర్యటించారు. లోతట్టు ప్రాంతంలో ఇంకా ఉన్న బాధితులు పునరావాస కేంద్రానికి రావాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు. ముంపు ప్రభావం తగ్గిన తర్వాత తిరిగి ఇంటికి వెళ్లవచ్చన్నారు. ఈ సందర్భంగా వరద సహాయక చర్యలను పునరావాస శిబిరాన్ని, వైద్య శిబిరాన్ని వారు సందర్శించారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ వరద ముంపుకు గురైన కుటుంబాలకు చెందిన వారందరూ పునరావాస కేంద్రానికి రావాలన్నారు. ఆదివారం తెల్లవారు జామునుంచి అప్పనవీడులోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను, పునరావాస శిబిరాల్లో సౌకర్యాలను పర్యవేక్షిస్తున్న శాసన సభ్యులు చింతమనేని ప్రభాకర్ స్థానికంగా ఉన్న పలు సమస్యలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీల దృష్టికి తీసుకువచ్చారు. ఎన్డిఆర్ఎస్ బృందాలతో కలిసి అప్పన వీడు,హౌసింగ్ కాలనీలోని ప్రజలను బోటులద్వారా పునరావాస కేంద్రానికి తరలించడం జరిగిందన్నారు.

తొలుత అప్పన వీడు రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు మళ్లింపు చర్యలను వారు పరిశీలించారు. వీరి వెంట ఏలూరు ఆర్డిఓ ఎన్ఎస్ కె ఖాజావలి,పెదపాడు మండల ప్రత్యేక అధికారి డిపివో టి.శ్రీనివాస విశ్వనాథ్, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఇ సత్యనారాయణ, స్థానిక తహశీల్దారు, ఎంపిడివో తదితర అధికారులు ఉన్నారు.

తక్షణమే స్పందించారు శభాష్

జీలుగుమిల్లి,మేజర్న్యూస్: సమస్య ఉంది అని తెలియగానే రక్కున స్పందించి సమస్యను పరిష్కరిస్తున్న శాసనసభ్యులు బాలరాజు సార్ శభాష్ అంటున్నారు ప్రజలు.

మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకువంక వారిగూడెం గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయని తెలుసుకుని వెంటనే స్పందిం చిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జోరు వానలో కల్వర్టును పరిశీలించేందుకు అధికారు లను వెంటబెట్టు కుని వచ్చారు.

రావడమే కాకుండా దగ్గరుండి కల్వర్టుకు లారీలతో కంకర రాళ్లు తెప్పించి పోసి తాత్కాలిక మరమ్మత్తులు చేశారు. జెసిబి ని రప్పించి తూరలకు అడ్డుగా ఉన్న చెత్త ను తొలిగించి వరద నీరు వెళ్లేందుకు వీలుగా చేశారు.

ప్రజలు రాకపోకలు కొనసాగించేలా రహదారిని సిద్ధం చేశారు.దీనిని గమనించిన స్థానికులు శభాష్ అంటూ కొనియాడారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గ వ్యాప్తంగా కల్వర్టులు దెబ్బతిన్నాయని వాటన్నిటిని వానలు తగ్గగానే మరమ్మత్తులు చేసికొత్తగా నిర్మాణం చేపడతామని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి డ్వామా పిడి రాము, పంచాయతీ రాజ్ డిఈ.సీతయ్య, తహసిల్దార్ సందీప్, వీఆర్వోఅశోక్, పంచాయతీ సెక్రెటరీ ఎస్కె కాజాబాబు,తెల్లం దుర్గారావు,దేవుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ సేవలు రాష్ట్రానికి ఎంతో అవసరం

: మంత్రి డా.నిమ్మల

పోడూరు,మేజర్న్యూస్: మండలంలో పెనుమదం గ్రామంలో జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగామంత్రి డా.నిమ్మల రామా నాయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జనసేన పార్టీ నాయకులు బోనం చిన్న బాబుతో కలిసి మంత్రి రామానాయుడు ప్రారంభించారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన పవన్ కళ్యాణ్ అభిమానులను మంత్రి రామానాయుడు అభినందించారు. కేకును కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకుని పెనుమదం గ్రామంలో ఒకరోజు అడ్వాన్స్ పుట్టినరోజు వేడుకలు జరుపు కునుట,ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయుట అభినందనీయమని మంత్రి తెలిపారు. గత రాక్షస పాలన చమరగీతం పాడాలని వైయస్సార్ వ్యతిరేక ఓటును చీలకూడదని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భరోసా, భద్రత కల్పించి సేవాతత్వంతో ముందుకు సాగుతున్న పవన్ కళ్యాణ్ సేవలు రాష్ట్రానికి ఎంతో అవసరమని మంత్రి తెలిపారు. పవన్ కళ్యాణ్కు ఒకరోజు ముందుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నామని ఆయన నిండు నూరేళ్లు హాయిగా ఉండాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోనంచినబాబు,పెనుమత్స రామభద్రిరాజు, గొట్టు ముక్కల సూర్యనారాయణ రాజు,టిడిపి,జనసేన, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి రోడ్లు,పంటలు ధ్వంసం

కుకునూర్,మేజర్న్యూస్ : గతమూడు రోజులు నుండి కురిసిన భారీ వర్షానికి కుక్కునూరు మండలంలోని సీతారామ నగరాన్ని కిన్నెరసాని వాగు అతలాకుతలం చేసింది.గ్రామానికి నష్టం చేయకపోయినా పంటపొలాలలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.ముఖ్యంగా వరి,పత్తి,మినుము, మిరప వంటి పంటలను వాగు ముంచెత్తింది.దెబ్బతిన్న పంటల పరిశీలనకు వచ్చిన తహశీల్దార్, ఈఓపిఆర్డిలకు నీళ్లు తప్ప పంటలు కానరాలేదు.పరిస్థితిని గమనించిన తహశీల్దార్ వెంటనే అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ను పంట నష్టంపై రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.కోతకు గురైన రోడ్డును వెంటనే పూడ్చాలని సెక్రటరీ,ఇంజినీరింగ్ అసిస్టెంట్ను ఆదేశించారు.రోడ్డు మరమ్మతుల కొరకు మండల పరిషత్ నిధులు కేటాయించాలని ఎంపీపీని కోరారు. గ్రామంలోకి కిన్నెరసాని వాగు వాటర్ వస్తే కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించాలని వారికి భోజన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేయలని స్థానికి విఆర్ఏలకు సూచించారు.వారి వెంట ఈఓపి ఆర్డి నరసింహారావు కూడా ఉన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలి

– సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

ఏలూరు,మేజర్ న్యూస్: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన దేశవ్యాపిత పిలుపులో భాగంగా ఆదివారం సిపిఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో ఆర్.ఆర్.పేట ఎన్టీఆర్ పార్కు వద్ద ప్రచార ఆందోళన కార్యక్రమం జరిగినది.నిత్యా వసర వస్తువుల ధరలు తగ్గించాలని, బడ్జెట్లో నిధులు కేటాయించాలని,పెట్రోల్,డీజిల్,వంట గ్యాస్ ధరలను తగ్గించాలని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన 100 రోజులలో ఆకాశంలో ఉన్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించి సామాన్యునికి అందుబాటులో ఉంచేలా చేస్తానని చెప్పారు,కానీ దాన్ని అమలు చేయలేకపోయారని విమర్శించారు. కేరళ రాష్ట్ర తరహాలో నిత్యావసర వస్తువులను సబ్సిడీ రేట్లకు చౌక దుకాణాల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు.సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రజలు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వాటిని తక్షణ పరిష్కారం కోసం సిపిఐ దేశ వ్యాప్తంగా ఈనెల 1 నుండి 6 వ తారీఖు వరకు ప్రచార ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు నాగం అచ్యుత్,ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్,కార్యవర్గ సభ్యులు కొల్లూరి సుధా రాణి,అడ్డగర్ల లక్ష్మి ఇందిర,మావూరి విజయ, ఎం.ఏ.హకీం, కౌన్సిల్ సభ్యులు భజంత్రి శ్రీనివాసరావు, ఉప్పులూరి రవి,బి. కె.ప్రసాద్,కొండేటి రాంబాబు,లక్ష్మీ, భవాని, గొర్లి స్వాతి,సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి సిఎం చంద్రబాబు ధ్యేయం

– లక్షలాది మందికి ఉపాధి

– సాగునీటి రంగానికి ఎంతో ప్రాముఖ్యత

కలిదిండి,మేజర్న్యూస్:కలిదిండి మండలం మట్టగుంట గ్రామంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 30 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు కేక్ కటింగ్ చేసి చంద్రబాబు నాయుడు కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం అలాగే విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి అనేక సంస్కారంలో తీసుకువచ్చిన ఘనత నారా చంద్రబాబు నాయుడుదని అన్నారు.

అలాగే ఐటీరంగాన్నిఅభివృద్ధిచేసి లక్షలాది మంది నిరుద్యోగులకి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు. కొపనాతి విష్ణు. తిరుమాని చిన్నికృష్ణ. కొపనాతి శంకర్. తిరుమలశెట్టి నరసింహస్వామి. మోకా శంకర్. పొన్నాల తాతారావు. నడుకుడిటి ఆంజనేయులు. బూత్ కమిటీ కన్వీనర్ తిరుమల శెట్టి ఈశ్వర పరశురాముడు, విద్యా కమిటీ చైర్మన్ లు కోపనాతి రాము. పొన్నాల బాల సత్యనారాయణ. తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

భీమడోలు,మేజర్న్యూస్ : ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన పురస్కరించుకొని భీమడోలు మండలంలో ఒకరోజు ముందుగా ఆదివారం జనసేన కార్యకర్తలు, నాయకులు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. దీనిలో భాగంగా పూళ్ళ, భీమడోలు లలో నిర్వహించిన రక్తదాన శిబిరాలకు విశేష స్పందన వచ్చింది. జనసేన పార్టీ నాయకులు పత్తి మదన్ ఆధ్వర్యంలో భీమడోలులో నిర్వహించిన రక్త దాన శిబిరంలో 52మంది రక్తదానం చేశారు.వీరిలో అధిక సంఖ్యలో మహిళలు ఉండటం విశేషం.రక్తదాన శిబిరాలను ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు,జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వట్టి పవన్, కూటమినాయకులు,టిడిపిఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు సందర్శించారు.రక్తదాతలను అభినందించారు.

సేవా కార్యక్రమాల్లో భాగంగా భీమడోలు సంతపేట రోడ్డులోని సాయి జ్ఞాన వృక్షం ఎదురుగా గల డివైడర్ లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా సత్య సాయి సేవ సమితి సమకూర్చిన 50 మొక్కలను నాటే కార్యక్రమాన్ని శాసనసభ్యులు ప్రారంభించారు. సత్య సాయి సేవ సమితి నాయకులు వర్ధినీడి వెంకటేశ్వరరావు (సాయి) పాల్గొన్నారు.

వామ్మో ? ఆ లెటర్ ఖరీదు రూ.30 వేలు !

– బెంబేలెత్తి పోతున్న ప్రభుత్వ ఉద్యోలు

– నాయకులు ప్రజాప్రతినిధులు ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు

బుట్టాయిగూడెం,మేజర్న్యూస్ : అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధి అంటే ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి కొంచెం భయం ఎందుకంటే ఎక్కడో దూర ప్రాంతానికి బదిలీ చేస్తారేమోనన్నా భయం.మరి కొంతమంది ఎక్కడైనా చేసేది ఉద్యోగమే వాళ్లు వీళ్ళ చుట్టూ ఎందుకు తిరగాలని తమ పని తాము చేసుకోనే వారు లేకపోలేదు.

మరి కొంతమంది ఉద్యోగులకు ప్రజా ప్రతినిధుల దగ్గరికి వెళితే కోరుకున్న చోట ఉద్యోగం చెయ్యొచ్చు అనే ఆశ. ఎమ్మెల్యే సిఫారసులెటర్ చేతికి వస్తేచాలు అతను అనుకున్న చోటుకి బదిలీ అయినట్టే.

ఎమ్మెల్యేసిఫార్సు లెటర్ దక్కించుకోవాలంటే బడా నాయకులు చుట్టూ తిరగడమే కాక అవసరమైతే ఆ సమయానికి వార్డు మెంబర్ గుమ్మం తొక్కల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వఉద్యోగుల కుబదిలీలు చేసుకు నేందుకు అవకాశం కల్పించడంతోఉద్యోగులు ఎమ్మెల్యే సిఫారసు లెటర్ కోసం నాయకులు, ప్రజా ప్రతినిధుల ఇళ్ల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు.ఎమ్మెల్యే లెటర్ దక్కించుకోవాలంటే ఇళ్లుచుట్టూ తిరగడం ఉద్యోగులకు తలనొప్పిగా మారింది. కొంతమంది వ్యక్తులు ఎమ్మెల్యే సిఫార్సు లేటర్ ని అడ్డం పెట్టుకొని వసూళ్లకు తెర లేపుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతుంది.అధికారికంగా ఆధారాలు లేకపోయినా ఈ మ్యం మ్యం తతంగం జరుగుతుందని ఆనోట ఈ నోట గుసగుసలు వినిపిస్తున్నాయి. కొంతమంది మధ్యవర్తులు ఉద్యోగులకు బదిలీల సిఫార్సు లెటర్ ఇప్పించి రూ.30 వేలు నుండి రూ. 50 వేలు వరకు తీసుకుంటున్నారనే ఆరోపణలు ప్రజల నుండి వినవస్తున్నాయి.ఇందులో ఎంతవరకు వాస్తవంఎంతవరకు అవాస్తవం అనేది వారికే ఎరుక. కొంతమంది ఉద్యోగు అడిగినంత ఇచ్చుకోలేక ఎక్కడికి వేసిన వెళతామని తిరుగు ముఖం పడుతున్నట్లు ప్రభుత్వ కార్యాలయాల వద్ద కొంతమంది ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.ఏ ప్రభుత్వం వచ్చిన ఉద్యోగులకు ఈ తలనొప్పి పోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా కొంతమంది వ్యక్తులు సిఫార్సు లెటర్కు నగదు తీసుకోవడం పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు.